# సెక్యులర్ ప్రభుత్వాన్నే గెలిపించాలి

- బీఆర్ఎస్ పాలనలో శాంతియుతంగా పాలన
- మైనార్టీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి
- అండగా ఉంటే మరింత అభివృద్ధి
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- ఘన స్వాగతం పలికిన మైనార్టీ నాయకులు, ప్రజలు



4వ డివిజన్‌లో చిన్నారికి స్వీట్ తినిపిస్తున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, నవంబర్ 5: సెక్యులర్ ప్రభుత్వాన్నే గెలిపించాలని, బీజేపీ మత రాజకీయాలతో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని, నగరంలోని మైనార్టీల అభ్యున్నతి కోసం పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం నగరంలోని 4, 5, 27 డివిజన్లల్లో విస్తృత ప్రచారం సాగించారు. మంత్రికి మైనార్టీ నాయకులు, ప్రజలు భారీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తెలంగాణలో ఈ పదేండ్ల కాలంలో శాంతియుతంగా అన్ని మతాల ప్రజలు గౌరవంతో ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. 4, 5, 27 డివిజన్లల్లో గతంలో ఉన్న రోడ్లు, మురుగు కాల్వల సమస్యలన్నింటిని పరిష్కరించామన్నారు. రోడ్లను అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే ముందుకు సాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. నగరంలో రాత్రిళ్లు అద్భుతంగా జిగేలుమనే వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. నగరాభివృద్ధి కోసం రూ. వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరం రూపురేఖలు పూర్తిగా మార్చివేశామన్నారు. కేబుల్‌బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులతో రాష్ట్రంలోనే గొప్ప నగరంగా మారుతుందన్నారు. గత మూడు ఎన్నికల్లో మైనార్టీలు తనకు అండగా నిలిచి గెలిపించారని పేర్కొన్నారు. వారి మద్దతు ఎప్పటికీ మరిచిపోమన్నారు. వారి రుణం తీర్చుకునే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. ఎక్కడా కూడ మట్టి రోడ్డు అనేది లేకుండా చేసి ప్రజలు ఇబ్బందులు తొలిగించామన్నారు. ఈ ఎన్నికల్లో కూడా మైనార్టీలు మరోసారి ఆశీర్వదిస్తే ఈ నగరాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీల ఆడబిడ్డల పెళ్లిలకు షాదీముబారక్ కింద రూ.లక్ష అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. ఇలాంటి పథకాలు మరిన్నీ రావాలంటే కారు గుర్తునే గెలిపించాలన్నారు. మీ బిడ్డగా, మీ మధ్యనే ఉండే తనకు అండగా ఉండి గెలిపిస్తే మరిన్నీ ప్రాజెక్టులు తీసుకొస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీతో తనకు ఉన్న 15 ఏళ్ల స్నేహాన్ని 'యే దోస్తీ హమ్ నహీ చోడోంగే' అంటూ పాట పాడారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, నాయకులు మాజిద్, షౌకత్, అలీ, మైనార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



4వ డివిజన్‌లో హాజరైన మహిళలు, ప్రజలు

# బీఆర్ఎస్‌ను ఆదరించండి

- పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి
- నగరంలో ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం
- పట్టణంలో 60 ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- నగర మేయర్ సునీల్‌రావు వెల్లడి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాకర్స్‌తో సమావేశం



వాకర్స్ ఇంటర్నేషనల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశంలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 5: అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వాకర్స్ అసోసియేషన్ల సభ్యులకు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు విజ్ఞప్తి చేశారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్‌ను 4వ సారి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వాలకు అండగా ఉండాలని కోరారు. నగరంలో ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 303 ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాకర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వాకింగ్‌ను అలవాటుగా మార్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సలహాలు, సూచనల ప్రకారం చాలా చోట్ల నగరపాలక సంస్థ ద్వారా నగరంలో చాలా చోట్ల వాకర్స్ కోసం ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. నగరంలో జ్యోతిబాపూలే గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఈపీడీఎం ట్రాక్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మల్టీపర్పస్ పార్కులో కూడా ₹కోటితో 700 మీటర్ల సింథటిక్ ట్రాక్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, గిద్దెపెరుమాండ్ల ఆలయ గ్రౌండ్, హౌజింగ్ బోర్డు గ్రౌండ్, మానేరు వంతెన సమీపంలో, ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానం, లేక్ పోలీస్‌స్టేషన్, అంబేద్కర్ స్టేడియంలో ప్రత్యేక ట్రాక్‌లు ఏర్పాటు చేసి లైటింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలో 60 ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికాలు చేశామన్నారు. ఇప్పటికే దాదాపు 35 ఓపెన్ జిమ్‌లను ప్రారంభించి అందుబాటులోకి తెచ్చామన్నారు. మరో 25 ఓపెన్ జిమ్‌లను కూడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని వాకింగ్ గ్రౌండ్లల్లో ట్రాక్‌లు, సాయంత్రం వాకింగ్ చేసేలా చక్కటి లైటింగ్ సౌకర్యం, కూర్చోవడానికి సీటింగ్ అరేంజ్‌మెంట్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్‌ను గెలిపించాలని, కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ల బాధ్యులు చెన్నమనేని సుధాకర్‌రావు, బుర్ర జగదీశ్వర్, రవీందర్, గుడపాటి రమణరెడ్డి పలు అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.



భగత్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

# అభివృద్ధికి ఓటు వేయండి

- ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలి
- ప్రజాపాలన కొనసాగాలంటే కేసీఆరే సీఎం కావాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- భగత్‌నగర్‌రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం

కార్పొరేషన్, నవంబర్ 5: సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలిచి ఆశీర్వాదం అందించాలని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. నగరంలో సాగుతున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో భగత్‌నగర్‌రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. పచ్చబడ్డ తెలంగాణలో పెరిగిన సంపదను దోచుకుపోయేందుకు ఆంధ్రానాయకులు హైదరాబాద్‌లో అడ్డ వేసి కుట్రలు పన్నుతున్నారన్నారు. కర్ణాటకలో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలలకే వాటిని అమలు చేయలేక చేతులు ఎత్తేసిందన్నారు. అలాంటి పార్టీని నమ్మితే ఇబ్బందులు తప్పవన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. వారు చేసిన దరిద్ర్యాన్ని తొలిగించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా కృషి చేస్తుందన్నారు. అన్ని రంగాల్లో ముందున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. తనను మరోసారి కరీంనగర్ ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని, గతంలో మూడుసార్లు తనకు అవకాశమిస్తే కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఈసారి అవకాశమిస్తే మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టాలని కోరారు. అభివృద్ధి పనులు కొనసాగాలంటే సీఎం కేసీఆర్ చేతుల్లోనే అధికారం ఉంచాలన్నారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు తోట రాములు, ఆకుల నర్మదానర్సయ్య, బీఆర్ఎస్ నాయకుడు కోల సంపత్‌రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు సంది అనంతరెడ్డి, జలపతిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

# పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి

- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పలు గ్రామాల్లో ప్రచారం

ఇల్లంతకుంట, నవంబర్ 5: అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించాలని మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఆదివారం పొత్తూరు, వంతడుపుల, పెద్దలింగాపూర్, రామోజీపేట, దాచారం, తెనుగువానిపల్లి గ్రామాల్లో రసమయి బాలకిషన్ బైక్ ర్యాలీ ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అభివృద్ధికి ఆకర్షితులై పలు గ్రామాల నుంచి యువత బీఆర్ఎస్‌లోకి వస్తున్నారన్నారు. పలు గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న, గడ్డం నాగరాజు, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్ గౌడ్, సర్పంచులు సిద్ధం శ్రీనివాస్, గొడిసెల జితేందర్ గౌడ్, పొన్నం తిరుపతి, కంకటి మనదనవ్వ, తదితరులు పాల్గొన్నారు.



పెద్దలింగాపూర్‌లో నాయకులను గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# జపాన్‌లో ప్రదర్శనకు జిల్లా విద్యార్థిని ప్రాజెక్టు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 5: 8వ జాతీయ ఇన్ స్పైర్ అవార్డుల పోటీల్లో సత్తాచాటి జిల్లా పేరును ఇప్పటికే ఇనుమడింపజేసిన అల్ఫోర్స్ విద్యాసంస్థలకు చెందిన పూర్వ విద్యార్థిని వీ శ్రీహితకు మరో అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యో వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'సకూర' కార్యక్రమంలో ఆమె పాల్గొనేందుకు కేంద్ర ప్రభుత్వ శాస్త్ర–సాంకేతిక మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు శనివారం రాత్రి జపాన్ రాజధాని టోక్యోకు విద్యార్థిని బయలుదేరి వెళ్లినట్టు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో చైనా, సైప్రస్, ఉజెబికిస్థాన్, తజెబికిస్థాన్, తురికెమెనిస్థాన్ లాంటి దేశాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ అరుదైన అవకాశం గ్రామీణ ప్రాంతానికి చెందిన పాఠశాల విద్యార్థినికి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.




ప్రదర్శనకు వెళ్తున్న రాష్ట్ర విద్యార్థులు